# వృత్తాంతము

## వెలి

సోమయాజులు మేరీ అరుంధతిని మన స్ఫూర్తిగా ప్రేమించాడు. మేరీ అరుంధతి కూడా సోమయాజుల్ని అంతగానూ ప్రేమించింది. డ్యూయెట్లు పాడుతూ డబుల్ మీనింగ్‌ల్లో ములిగి తేలడానికి జీవితం సినిమా కాదు కాబట్టి బుద్ధిగా ప్రేమించుకుని పెళ్ళి చేసు కుందామనే మంచి నిర్ణయానికి వచ్చారు ఇద్దరూ.

"మేమిద్దరం ప్రేమించుకున్నాం, పెళ్ళి చేసు కుందామనుకుంటున్నాం. కాబట్టి మా ఇద్దరికీ మీరు పెళ్ళిచేసి మీ పెద్దరికాన్ని నిలబెట్టుకో గలరు"అని తమ తమ తల్లితండ్రులకి తెలి యజేసారు. వారి వారి తల్లితండ్రులు ఈ వార్త విని సంతోషించనూలేదు, విచారించనూ లేదు. "మీ ప్రేమని మేం కాదనడం లేదు. పెళ్ళిని కూడా కాదనడం లేదు. మీ ప్రేమ మీ పెళ్ళితో ముగియదు. పెళ్ళి తర్వాతే కథ మొదలవుతుంది. బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోండి" అని వాళ్ళ తల్లితం డ్రులు ముక్తకంఠంతో కాకపోయినా ఏకాభి ప్రాయంతో సలహా ఇచ్చారు.

"మన పెళ్ళి అయ్యాక ఎలా వుంటుందో వూహించుకుందామా" అన్నాడు సోమయా జులు చిలిపిగా.

"సినిమాలో హీరో హీరోయిన్లలాగా వర్షంలో తడిసి మడి కట్టుకుని వెనకాల పది అబ్బా యిలు, పది మంది అమ్మాయిలు కవాతు చేసినట్టు వివిధ విన్యాసాలు చేస్తుంటే పాట లాంటిది పాడి డ్యాన్సు లాంటిది నేను చెయ్యను. కాబట్టి దూర దూరంగా కూర్చుని తీరిగ్గా ఆలోచిద్దాం" అని స్పష్టంగా చెప్పింది మేరీ అరుంధతి.

"సరే! మన పెళ్ళిని మన పెద్దలు పూర్తిగా ఆమోదించకపోయినా మనల్ని వెలివెయ్యరు. అలాగని మనల్ని వాళ్ళతో కలుపుకో మాకలు పుకోరు. మన బతుకులు మనం బతకాలి అవునా" అన్నాడు సోమయాజులు.

"నాకు వీలైనంత త్వరలోనే కనీసం కులప్రా తిపదిక మీదైనా వుద్యోగం వస్తుంది" అంది మేరీ అరుంధతి

"నీ పేరులో మేరీ అని వుంది కదా అది నీ కులానికి.." అని నసిగాడు సోమయాజులు.

"మేరీ అంటే మా అమ్మమ్మ పేరు. ఆవిడ మతం తీసుకుంది కానీ మా అమ్మ మతం తీసుకోలేదు.' ' అంది మేరీ అరుంధతి.

"అవును. మతం అనేది ఒక నమ్మకం మాత్రమే! అది ఎప్పుడైనా మారవచ్చు. మనం మార్చుకోవచ్చు. కులం మాత్రం పుట్టుకవల్ల వస్తుందని కోర్టు తీర్పుకూడా వుంది. కాబట్టి నాకు నీ కంటే ముందే వుద్యోగం రావచ్చు" అన్నాడు సోమయాజులు.

"నీ తెలివి తేటల్ని చూసి ఏదైనా ప్రైవేట్ కంపెనీవాళ్ళు నీకు పిలిచి మరీ ఇస్తారు వుద్యోగం. మనం హాయిగా బతకొచ్చు. ఆ నమ్మకం నాకుంది" అంది అతని తెలివితే



టల్ని ప్రేమించిన మేరీ అరుంధతి. ఆమె అమాయకత్వాన్ని ప్రేమించిన సోమయాజులు "తథాస్తు" అని దీవించుకున్నాడు.

"మన పెళ్ళి మనిద్దరి జీవితాల వరకూ ఎటు వంటి ప్రమాదాన్ని తీసుకురాదు. మనకులాలు వేరైనా మతం అభిమతం ఒక్కటే. అల వాట్లు ఆహారం తేడాని ఇద్దరం కొంచెం త్యాగం చేస్తే ఒక రాజీకి రావచ్చు ఆ నమ్మకం నాకుంది" అంది మేరీ అరుంధతి.

"మన పెళ్ళి మనదాకా ఫర్వాలేదు. మనకి పుట్టబోయే పిల్లల మీద ప్రభావం చూపిస్తే?" అన్నాడు సోమయాజులు.

"ఒక అబ్బాయి, ఒక అమ్మాయి చాలు నాకు" అంది సిగ్గుపడుతూ మేరీ అరుంధతి.

"అబ్బాయి చదువు, వుద్యోగం, అమ్మాయి పెళ్ళి గురించి కూడా ఆలోచించి సిగ్గుపడు" అన్నాడు సోమయాజులు.

"మన అమ్మాయిని మీ చెల్లి కొడుక్కి చేసుకోకపోయినా మా అన్నయ్య కొడుక్కి చేసుకుంటారు. మన అబ్బాయి వుద్యోగం నా కుల ప్రాతిపదిక మీద సులభంగా వస్తుంది" అంది సిగ్గుపడకుండా మేరీ అరుంధతి.

ఆమె అమాయకత్వానికి అతనికి నవ్వొ చ్చింది. నవ్వాడు. ఆమెకి కోపం వచ్చింది.

"మన దేశంలో భారతమాతకీ జై అంటారు. మాతృభూమి అంటారు. మాతృ భాష అంటారు. మాతృకులం అని మాత్రం అనరు. కులాతీత మతాతీత వ్యవస్థని రాజకీ యనాయకులు వుపన్యాసాలు ఇస్తారు. పెళ్ళి దగ్గరకీ, ఎన్నికల దగ్గరకీ వచ్చినప్పుడు మాత్రం కులం మతం తప్ప ముఖ్యమైనది మరొకటి వుండదు. మన దేశంలో పాలకులు కులాన్ని, మతాన్ని ప్రోత్సహించినట్టు మతాంతరాన్ని, కులాంతరాన్ని ప్రోత్సహించరు. డబ్బుకి వున్న బలం కంటే మన దేశంలో కులం, మతమే బలమైనవి. కులం సంకరం కాకుండా కాపా డ్డమే ఈ పాలకులకు మంచిది. అందుకే ఈ వ్యవస్థ మీద నాకు నమ్మకం పోయింది" అన్నాడు సోమయాజులు ఆవేశంగా.

"ముందు తరాల మీద నాకు నమ్మకం వుంది. మనం పెళ్ళి చేసుకుందాం. కులాం తర తరాన్ని సృష్టిద్దాం. కుళ్ళిపోయిన ఈ కులాన్ని తగలేసి ఆ కులాంతర తరం కొత్త భారతాన్ని నిర్మిస్తుంది. అర్జంటుగా మనం పెళ్ళి చేసుకుని పిల్లల్ని కందాం" అంది మేరీ అరుంధతి కూడా ఆవేశంగా.

"మరి మీ తల్లితండ్రులూ, మా తల్లితం డ్రులూ, ఈ సమాజం ఈ వ్యవస్థ..." అని నసిగాడు సోమయాజులు.

"వాళ్ళందర్నీ మనమే వెలివేద్దాం. వాళ్ళ తీర్పుల్ని వెలివేద్దాం" అంది తెలివిగా మేరీ అరుంధతి.

— తంబు